క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొరిటిపాడు: 11 కేవీ ఫీడర్ పరిధిలో మెయింటెన్స్, చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా విద్యుత్ సరఫరాలో శనివారం అంతరాయం ఏర్పడుతుందని ఈఈ పీ.హెచ్.హుస్సేన్‌ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. గుంటూరు తూర్పు పరిధి విజయవాడ రోడ్డులోని వాసవీ కాంప్లెక్స్, బెస్ట్ ప్రైస్, ఇజ్రాయిల్‌పేట, ఎన్టీఆర్ నగర్, మంగళదాస్‌నగర్, అంబేడ్కర్ నగర్, అరుంధతీ నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.
విద్యుత్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరా నిలిపి వేయనున్నట్లు గుంటూరు -2 డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శుక్రవారం తెలిపారు. శ్రీనగర్ 7/2వ లైను నుంచి 7/7 లైను, మల్లికార్జునపేట1,2,5 లైనులు, గోపాలకృష్ణయ్య కాలనీ తదితర ప్రాంతాల్లో సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

శ్రీకృష్ణుడి లీలలు మధురం



నగరంపాలెం: సాహితీవేత్త పి.ఎస్.ఆర్. ఆంజనేయప్రసాద్ జయంతిలో భాగంగా బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై శ్రీకృష్ణ జననంపై ఆధ్యాత్మిక ప్రవచనం శుక్రవారం కొనసాగింది. ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్.మస్తానయ్య, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ప్రముఖ సాహితీవేత్త ఆచార్య మల్లాప్రగడ శ్రీమన్నారాయణ మూర్తి ప్రవచనం చేశారు. శ్రీకృష్ణుడి జన్మ వృత్తాంతం, బాలుడిగా ఆయన లీలలు మధురాతి మధురమని తెలిపారు. ఆయన బాల క్రీడలన్నీ దివ్య వైభవాలని పేర్కొన్నారు. పుట్టుకే లేని పరమాత్మ పుట్టినట్లు కనిపించడం ఒక లీల పేర్కొన్నారు. మానవ జాతిని ధర్మ మార్గంలో నడిపించేందుకు ఆయన అవతరించాడని తెలిపారు. తనలోనే సమస్త విశ్వం దాగిందని, తల్లికి తన నోటిలో విశ్వరూపాన్ని చూపించిన సన్నివేశం ఇందుకు తార్కాణమని చెప్పారు. కార్యక్రమంలో పి.రవికిశోర్, పి.హైమానంద పాల్గొన్నారు.

కళంకిత నేతలపై అనర్హత వేటు వేయాలి

లక్ష్మీపురం: చట్టాలను ఉల్లంఘించే వారు శాసనకర్తలు కాకూడదని, కళంకిత నేతలపై అనర్హత వేటు వేయాలని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి తెలిపారు. అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. పలు క్రిమినల్ కేసుల్లో నిందితులైన వారిని పార్టీలు ఎన్నికల్లో నిలబెడ్డటం దురదృష్టకరమని పేర్కొన్నారు. అక్రమార్జనతో ఎన్నికలలో గెలిచి మళ్లీ అంతకంత సంపాదించుకోవడం చాలా మందికి పరిపాటైందని తెలిపారు. కొద్ది నెలల కిందట జరిగిన మహారాష్ట్ర శాసనసభకు ఎన్నికైన వారిలో 65 శాతం మందిపై, తాజాగా ఢిల్లీ ఎన్నికల్లో గెలిచిన వారిలో 44 శాతం మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రస్తుత లోక్ సభలో తీవ్ర నేరారోపణ ఉన్న ఎంపీలు 31 శాతం ఉన్నారని తెలిపారు. కళంకిత నేతలపై అనర్హత వేటు వేయాలన్న లా కమిషన్ సిఫార్సును అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఎమ్మెల్సీగా లక్ష్మణరావును గెలిపించండి

మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం



లక్ష్మీపురం: కృష్ణా, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గానికి ఈనెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కేఎస్ లక్ష్మణరావు తిరిగి గెలిపించాలని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం కోరారు. లక్ష్మణరావు గెలుపు కోసం శుక్రవారం గుంటూరు నగరంలోని అన్ని ఉన్నత పాఠశాలలో ఆయన శుక్రవారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2017 నుంచి పీడీఎఫ్ ఎమ్మెల్సీలు అవినీతికి దూరంగా ఉంటూ, ప్రజల పక్షాన నిజాయతీగా పోరాటం చేశారని తెలిపారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాకుండా, ప్రజల సమస్యలపై పోరాడేందుకు లక్ష్మణరావు పోటీ చేస్తున్నారని పేర్కొన్నారు. శాసన మండలి రాజకీయాలకు అతీతంగా రాజ్యాంగ, ప్రజాస్వామ్య విలువలు కాపాడటం కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేయబడిందని వివరించారు. ఆ లక్ష్యం నెరవేర్చాల్సిన బాధ్యత గ్రాడ్యుయేట్లపై ఉందని కోరారు. 2007 నుంచి అన్ని వర్గాలకు అందుబాటులో ఉంటూ నిస్వార్థంగా పనిచేస్తున్న లక్ష్మణరావుకు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ సభ్యులు కైలాసనాథ్, ప్రజా సంఘ నాయకులు సాంబశివరావు పాల్గొన్నారు.

రోగులకు 'వెన్ను'దన్ను

- వెన్నుముక పరిశోధనల్లో సత్తా చాటుతున్న డాక్టర్ నరేష్‌బాబు
- గత ఏడాది రెండు అంతర్జాతీయ అవార్డులు సొంతం
- తాజాగా జాతీయ అవార్డుతో రికార్డు

వెన్నుముక సమస్యలతో బాధపడుతున్న వారికి మెరుగైన చికిత్సలు అందించడమే లక్ష్యంగా పరిశోధనలు చేస్తూ గుంటూరు ఖ్యాతిని నగర వైద్యుడు నరేష్‌బాబు అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లారు. సినీ రంగంలో ఆస్కార్ మాదిరిగా ఉండే థామస్ వైట్ క్లౌడ్ అవార్డు గత ఏడాది ఏప్రిల్‌లో ఆయనకు లభించింది. అంతర్జాతీయ అవార్డు అందుకుని మరింత ఉత్సాహంతో పరిశోధనలు చేస్తున్న ఆయనకు రెండోసారి కూడా అదే తరహా అవార్డు లభించింది. తాజాగా ఇండియన్ స్పయిన్ సర్జన్స్ అసోసియేషన్ అందజేసే బెస్ట్ స్పయిన్ క్లినికల్ రీసెర్చి జాతీయస్థాయి అవార్డును అందుకున్న మొట్టమొదటి తెలుగు వైద్యుడిగా నరేష్‌బాబు రికార్డు సృష్టించారు. గుంటూరు వైద్య రంగం ఖ్యాతిని దేశవ్యాప్తంగా మారుమోగేలా చేశారు.

గుంటూరు మెడికల్: గుంటూరులోని మల్లికా స్పయిన్ సెంటర్ అధినేత, సీనియర్ వెన్నుముక శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ జంబులదిన్నె నరేష్‌బాబుకు 2024 సంవత్సరానికి గాను వైద్య రంగంలో ప్రతిష్టాత్మకమైన రెండు అంతర్జాతీయ అవార్డులు రెండు నెలల వ్యవధిలో లభించాయి. జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతులున్న బెస్ట్ స్పయిన్ క్లినికల్ రీసెర్చి అవార్డు 2024ను బెంగుళూరులో ఈ ఏడాది జనవరి మూడో వారంలో జరిగిన స్పయిన్ సర్జన్స్ జాతీయ సదస్సులో అందుకుని అరుదైన రికార్డును సొంతం చేసుకున్నారు.

వైద్యుల కుటుంబం

గుంటూరుకు చెందిన డాక్టర్ ఓలేటి శివలీల గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేసి పదవీ విరమణ చేశారు. డాక్టర్ జె.రంగస్వామి గుంటూరు జీజీహెచ్ రేడియో ఫిజిక్స్ ప్రొఫెసర్‌గా పని చేసి పదవీ విరమణ చేశారు. వీరికి ద్వితీయ సంతానంగా జన్మించిన డాక్టర్ జె.నరేష్‌బాబు వైద్య కళాశాలలో చదువుకునే రోజుల నుంచే పరిశోధనలపై మక్కువ చూపించేవారు. గుంటూరు వైద్య కళాశాలలో 1991లో ఎంబీబీఎస్, 1998లో ఆర్థోపెడిక్‌లో పీజీ చదివారు. విజయవాడలోని హెల్త్ యూనివర్సిటీ 2002లో బెస్ట్ అవుట్ గోయింగ్ స్టూడెంట్‌గా డాక్టర్ నరేష్‌బాబుకు అవార్డు అందజేసింది. వెన్నుముక సమస్యలపై ఆసక్తి చూపించారు. 2002 నుంచి 2005 వరకు కోయంబత్తూరులోని గంగా ఆసుపత్రిలో శిక్షణ పొందారు. 2005 నుంచి 2006 వరకు సింగపూర్‌లోని నేషనల్ యూనివర్సిటీలో, 2007లో అమెరికాలోని చికాగోలో, 2008లో తైవాన్, సౌత్ కొరియా, జపాన్‌లలో వెన్నుముక చికిత్సలపై పలు సూపర్ స్పెషాలిటీ కోర్సులను అభ్యసించారు.



జాతీయ అవార్డు అందుకుంటున్న డాక్టర్ నరేష్‌బాబు

2002లో తొలి అవార్డు

పీజీ వైద్య విద్యార్థిగా గోల్డ్‌మెడల్ అందుకున్న ఆనందంలో పరిశోధనలపై ఎక్కువ దృష్టి సారించి, కాళ్లల్లో ఓ పెన్ ఫ్యాక్చర్స్‌పై నరేష్‌బాబు పరిశోధన చేశారు. కాలు విరిగి చర్మం బాగా దెబ్బతిన్న వారికి ఆయన చేసిన పరిశోధనలకు గాను 2002లో మొట్టమొదటిసారిగా యతిరాజులు గోల్డ్‌మెడల్ అవార్డును అందుకున్నారు. నాటి నుంచి ప్రతి ఏడాది పరిశోధనలు చేస్తూ రోగులకు మెరుగైన చికిత్సలు అందించడంలో తన వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. డాక్టర్ నరేష్‌బాబు చేస్తున్న పరిశోధనలకు ఇప్పటి వరకు 25 అంతర్జాతీయ, 25 జాతీయ అవార్డులు లభించాయి. గత ఏడాది జనవరిలో అత్యంత ప్రతిష్టాత్మకమైన బెస్ట్ స్పయిన్ క్లినికల్ రీసెర్చి అవార్డును అందుకుని గుంటూరు వైద్య రంగం ఖ్యాతి జాతీయస్థాయిలో మారుమోగేలా చేశారు.

స్టాండింగ్ ఎమ్మారైతో పరిశోధనలు

డాక్టర్ నరేష్‌బాబు వెన్నుముక సమస్యలపై ఎక్కువ దృష్టి పెట్టారు. ప్రాథమిక దశలోనే గుర్తించేలా సౌత్ ఇండియాలో ఎక్కడా లేని విధంగా స్టాండింగ్ ఎమ్మారై వైద్య పరికరాన్ని తమ ఆసుపత్రిలో అందుబాటులోకి తెచ్చారు. వెన్ను సమస్యలపై పరిశోధనలకు స్టాండింగ్ ఎమ్మారై ఎంతో దోహదపడుతున్నట్లు ఆయన తెలిపారు. గత ఏడాది థామస్ వైట్ క్లౌడ్ అంతర్జాతీయ అవార్డు దక్కడంలో స్టాండింగ్ ఎమ్మారై ద్వారా చేసిన పరిశోధనలే కారణమని పేర్కొన్నారు. ఈ ఏడాది జాతీయస్థాయి అవార్డు లభించటానికి కూడా తమ ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న డైనమిక్ స్టాండింగ్ ఎమ్మారై కారణమని వెల్లడించారు. సర్వేకల్ స్పాండిలైటిస్, మెడ నరాల ఒత్తిడితో బాధపడుతున్న రోగుల్లో రోజువారీగా జరిగే మెడ కదలికలు, వ్యాధి పురోగతిపై 50 మంది రోగులపై ఏడాదిపాటు గుంటూరు మల్లికా స్పయిన్ సెంటర్‌లో పరిశోధన చేశామన్నారు. పడుకోబెట్టి ఎంఆర్ఐ స్కాన్ పరీక్ష చేస్తే స్పయిన్‌లో సీ5, సీ6 నరం నలిగినట్లు కనిపిస్తోందని, కూర్చోబెట్టి, మెడ వంచి స్కాన్ చేస్తే సీ3, సీ4లో కూడా సమస్య ఉన్నట్లు గుర్తించామని వివరించారు. ఇప్పటి వరకు ఈ విషయాన్ని ఎవరూ గుర్తించలేదని, సీ5, సీ6 నరం నలిగినట్లు మాత్రమే గుర్తించారని తెలిపారు. స్పయిన్ సమస్యను చాలా త్వరగా గుర్తించేందుకు, చికిత్స అందించేందుకు ఈ పరిశోధన ఎంతో ఉపయోగపడుతుందని ఆయన చెప్పారు.

గురువు స్ఫూర్తితో పరిశోధనలు



కోయంబత్తూరులోని గంగా హాస్పటల్‌కు చెందిన సీనియర్ స్పయిన్ సర్జన్ డాక్టర్ రాజశేఖరన్ స్ఫూర్తితో వెన్నుముక పరిశోధనలు చేస్తున్నా. పీజీ వైద్య విద్య పూర్తి కాగానే డాక్టర్ రాజశేఖరన్ వద్ద వెన్నుముక శస్త్రచికిత్సల్లో మెళకువలు నేర్చుకున్నా. ఒక పక్క రోగులకు సేవలందిస్తూనే ప్రయోగాలు చేస్తున్నా. గుంటూరు జిల్లాలో ఫ్లోరైడ్ సమస్యపై కూడా పరిశోధనలు చేసినందుకు జాతీయ స్థాయిలో అవార్డు లభించింది. ఇండియాలో ఇప్పటి వరకు ఎవరూ అందుకోని అంతర్జాతీయ అవార్డులు దక్కాయి.

–డాక్టర్ జంబులదిన్నె నరేష్‌బాబు, సీనియర్ స్పయిన్ సర్జన్

నూరి ఫాతిమాకు అభినందనల వెల్లువ

పట్నంబజారు: వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలిగా నియమితులైన నూరిఫాతిమాకు అభినందనలు వెల్లువెత్తాయి. మంగళదాస్‌నగర్‌లోని ఆమె కార్యాలయం వద్దకు శుక్రవారం పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు, కార్మిక సంఘాలు, కులసంఘాల నేతలు పెద్దఎత్తున చేరుకుని శుభాకాంక్షలు తెలిపారు. శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

వైఎస్సార్ సీపీ నేతలను మర్యాదపూర్వకంగా కలిసిన నూరిఫాతిమా

వైఎస్సార్ సీపీ నేతలను షేక్ నూరిఫాతిమా శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సిద్ధార్థ నగర్‌లోని కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, రెడ్డిపాలెంలోని కార్యాలయంలో గుంటూరు, నరసరావుపేట పార్లమెంటు జిల్లాల పార్టీ పరిశీలకులు మోదుగుల వేణుగోపాలరెడ్డి, బృందావన్ గార్డెన్స్‌లోని కార్యాలయంలో ఎమ్మెల్సీ, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి, గుజ్జనగుండ్లలోని నివాసంలో ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నంను మర్యాదపూర్వకంగా కలిశారు. వారిని శాలువాలతో సత్కరించి, పుష్ప గుచ్ఛం అందజేశారు. నూతనంగా పదవి చేపట్టిన నూరిఫాతిమాను పార్టీ నేతలు అభినందించారు. బాధ్యతతో పార్టీని ముందుకు తీసుకెళ్లాలని, ప్రతి ఒక్కరితో సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. భవిష్యత్తులో మరిన్ని పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.

అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకోవాలి

పొన్నూరు: త్వరలో జరగనున్న రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో అగ్రిగోల్డ్ బాధితులకు పూర్తి న్యాయం జరిగే విధంగా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవాలని, లేనిపక్షంలో పోరాటాలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కేతినేని అగస్టీన్ తెలిపారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో అసోసియేషన్ అధ్యక్షుడు షరీఫ్ అధ్యక్షతన శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అగస్టీన్ మాట్లాడుతూ అగ్రిగోల్డ్ 2015లో మూతబడటంతో రాష్ట్రంలో 19.52 లక్షల మందికి అన్యాయం జరిగిందని తెలిపారు.

ఎక్కువ పిండి పదార్థాల ఆహారంతో అనారోగ్యం

గుంటూరు మెడికల్: ఎక్కువ పిండి పదార్థాలున్న ఆహారం తీసుకోవడం వల్ల దీర్ఘకాలిక సమస్యలు తలెత్తుతాయని గుంటూరు మెడికల్ కాలేజీ ఫార్మకాలజీ విభాగాధిపతి డాక్టర్ కె.శంకర్ పేర్కొన్నారు. గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో తక్కువ పిండి పదార్థాలు, ఎక్కువ మాంసకృత్తుల డైట్‌పై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ శంకర్ మాట్లాడుతూ ఎక్కువ పిండి పదార్థాలున్న ఆహారం తీసుకోవడం వల్ల రక్తపోటు, మధుమేహం, ఊబకాయం, థైరాయిడ్ తదితర దీర్ఘకాలిక సమస్యలు తలెత్తుతాయని తెలిపారు. ఆహారంలో ఎక్కువగా ప్రోటీన్స్, కొవ్వులు, మంచి ఆయిల్స్ ఉండాలన్నారు. ప్రస్తుతం పని ఒత్తిడి వల్ల పలువురు ఆన్‌లైన్ ఫుడ్‌కు అలవాటయ్యారని, దీనివల్ల మానసిక ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. డాక్టర్ నీలి ఉమా జ్యోతి, డాక్టర్ వి. వెంకట కిరణ్ మాట్లాడుతూ స్ట్రీట్ ఫుడ్ వల్ల పలు అనారోగ్య సమస్యలు ఏర్పడుతున్నాయని, దీనికి దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ వి. సాయి కిరణ్, పోస్టు గ్రాడ్యుయేట్స్, జూనియర్ డాక్టర్స్, స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు

కృత్రిమ మేధపై పరిజ్ఞానం అవసరం

వీసీ ఆచార్య కె.గంగాధరరావు

ఏఎన్‌యూ: కృత్రిమ మేధ (ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్) ప్రయోజనాలు, ప్రమాదాల గురించి విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య కంచర్ల గంగాధరరావు పేర్కొన్నారు. వర్సిటీలో కంప్యూటర్ సైన్స్ – ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల జాతీయ సదస్సును శుక్రవారం ప్రారంభించారు. ఏఎన్‌యూ రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి, ప్రిన్సిపాల్ ఆచార్య కె.వీరయ్య మాట్లాడుతూ ఈ సదస్సు విద్యార్థుల విజ్ఞాన విచక్షణలకు ఎంతో ప్రయోజనకరమని చెప్పారు. మైక్రో సాఫ్ట్ సంస్థకు చెందిన ఏఐ డేటా ప్రత్యేక ప్రతినిధి శేఖర్ రాజు మాట్లాడుతూ విద్యార్థులు సృజనాత్మకత, పరిశోధనాత్మక దృష్టితో విద్యనభ్యసిస్తూ అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలని సూచించారు. క్వాడ్రెంట్ టెక్నాలజీస్ సేల్స్ మేనేజర్ ఆర్.రవి, మైక్రోసాఫ్ట్ టెక్ సేల్స్ సౌత్ ఇండియా ప్రతినిధి శ్రీకాంత్ కురుప్, అస్యూర్ సొల్యూషన్స్ ప్రత్యేక ప్రతినిధి అన్షుమాన్ అగర్వాల్, డాక్టర్ వేమూరి రవి, ఐమర్ సొసైటీ ఇండియన్ సర్వర్స్ సీఈఓ డి.సాయిసతీష్ విద్యార్థులకు కృత్రిమ మేధ గురించి పలు విజ్ఞాన దాయకమైన అంశాలను తెలియజేశారు. సదస్సులో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన అధ్యాపకులు కె.లావణ్య, జి. నీలిమ, యు.సూర్య కామేశ్వరి, ఆర్. వసంత, పుష్పలత, బసవేశ్వరరావు, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.



సదస్సును ప్రారంభిస్తున్న వీసీ

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగర పరిధిలోని అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కమిషనర్ పులి శ్రీనివాసులు అధికారులకు సూచించారు. ఆయన శుక్రవారం రోజువారీ పర్యటనలో భాగంగా కేవీపీ కాలనీ, నల్లచెరువు, శ్రీనివాసరావు తోట, హనుమాన్ నగర్, ముత్యాలరెడ్డి నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. అభివృద్ధి, పారిశుద్ధ్య పనులను పరిశీలించి, సంబంధిత అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణ సమయాల్లోనే వార్డ్ సచివాలయ ఎమినిటీ కార్యదర్శులు తప్పనిసరిగా అందుబాటులో ఉండి పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఇళ్ల మధ్యల్లో ఖాళీ స్థలాలు వల్ల చుట్టు పక్కల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పలు ఫిర్యాదులు అందిస్తున్నారని, శానిటేషన్ కార్యదర్శులు స్థల యజమానులకు శుభ్రం చేసుకోవాలని నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. రోడ్ల పక్కన అనధికార దుకాణాలను తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులను, కార్యదర్శులను ఆదేశించారు. పర్యటనలో డీఈఈ మధుసూదన్, ఏసీపీ మల్లికార్జున, ఆర్ఓ రవికిరణ్‌రెడ్డి, ఎస్ఎస్ ఆనందకుమార్, టీపీఎస్‌లు, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘాల అభివృద్ధికి కృషి

స్వయం సహాయక సంఘాల సభ్యుల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తోందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో శుక్రవారం మెప్మా సీఎంఎంలు, సీఓలు, ఆర్పీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన ఉత్పత్తులను ఈ–కామర్స్ ద్వారా అమ్మడానికి ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. ఒకే రోజు లక్ష ఉత్పత్తులను అమ్మకం ద్వారా రూ.1 కోటి ఆదాయం సభ్యులకు అందేలా లక్ష్యాన్ని పెట్టుకున్నట్లు చెప్పారు. ఉత్పత్తుల కొనుగోలుకు ఈ నెల 16 నుంచి ప్రీబుకింగ్ ఆప్షన్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అమ్మకాల ద్వారా గిన్నిస్ రికార్డ్ సాధించడానికి ఆర్పీలు నగరంలో సభ్యులను భాగస్వాములను చేయాలని మెప్మా సిబ్బందిని ఆదేశించారు. సమావేశంలో డెప్యూటీ కమిషనర్ డి.శ్రీనివాసరావు, మెప్మా పీడీ విజయలక్ష్మి, ఉపా సెల్ పీడీ రామారావు పాల్గొన్నారు.



అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్న కమిషనర్

స్వచ్ఛ ఆంధ్ర– స్వచ్ఛ దివస్‌లో భాగస్వాములు కావాలి

ప్రతి నెలా 3వ శనివారం నిర్వహిస్తున్న స్వచ్ఛ ఆంధ్ర– స్వచ్ఛ దివస్‌లో నగరంలో ప్రతి ఒక్కరినీ భాగస్వాములు చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు నోడల్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నగరపాలక సంస్థ నోడల్, ప్రజారోగ్య అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రతి నెలా ఒక థీమ్‌ను ప్రభుత్వం ఇస్తుందని, ఫిబ్రవరికి 'సోర్స్ రీ సోర్స్'ని ప్రకటించిందని తెలిపారు. తమ పరిధిలోని ప్రతి ఇంటికీ నోడల్ అధికారులు వెళ్లి తడి పొడి వ్యర్థాల విభజన, హోం కంపోస్ట్ తయారీ, ర్యాలీల ద్వారా సచివాలయ కార్యదర్శులు, కార్మికులు ప్రజలకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో మాస్ క్లీనింగ్ చేసుకునేలా అవగాహన కలిగించాలని చెప్పారు. వార్డ్ సచివాలయాల వారీగా చేపట్టిన కార్యక్రమాలను స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర యాప్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డెప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సీహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు పాల్గొన్నారు.

20న జేకేసీ కళాశాలలో సాఫ్ట్‌స్కిల్స్ పోటీలు



గుంటూరు ఎడ్యుకేషన్: జేకేసీ కళాశాల ఆంగ్ల శాఖ ఆధ్వర్యంలో ఈనెల 20న డమ్ షరేడ్స్ పేరుతో రాష్ట్రస్థాయి సాఫ్ట్‌స్కిల్స్ పోటీలను నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పి. గోపీచంద్ తెలిపారు. కళాశాలలో శుక్రవారం పోటీలకు సంబంధించిన పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా గోపీచంద్ మాట్లాడుతూ విద్యార్థుల్లో భావ వ్యక్తీకరణ, వ్యక్తిత్వ వికాసం, టీం వర్క్‌ను పెంపొందించడంలో భాగంగా డమ్ షరేడ్స్ పేరుతో నిర్వహిస్తున్న పోటీల్లో పాల్గొనేందుకు డిగ్రీ, ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థులు అర్హులని తెలిపారు. ప్రతి టీం నుంచి ఇద్దరేసి ఉండాలని, ప్రతి కళాశాల నుంచి మూడు టీంలు వరకు పాల్గొనవచ్చునని చెప్పారు. విద్యార్థులు సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్ ధ్రువపత్రంతో పాటు ఐడీ కార్డులను విధిగా ధరించి హాజరు కావాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కళాశాల పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్సార్కే ప్రసాద్, ఆంగ్ల శాఖాధిపతి పంచుమర్తి నాగసుశీల, సభ్యులు డాక్టర్ వి. ప్రసాదరావు, జె. మాధవీలత పాల్గొన్నారు.

వీర జవాన్‌లకు నివాళులు

ఏఎన్‌యూ: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం శాఖ ఆధ్వర్యంలో 2019 ఫిబ్రవరి 14న పుల్వామాలో భారత సీఆర్పీఎఫ్ జవాన్‌లపై ఉగ్రదాడిని నిరసిస్తూ శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అఖిల భారత విద్యార్థి పరిషత్ కార్యదర్శి వంశీ మాట్లాడుతూ జమ్ము కాశ్మీర్‌లో ఉగ్రవాద ముష్కరులు భారత్ సీఆర్పీఎఫ్ కాన్వాయిపై ఆత్మాహుతి దాడికి పాల్పడ్డారన్నారు. దాడిలో వీరమరణం పొందిన జవాన్‌ల ఆత్మకు శాంతి కలగాలని కోరారు. ఈ సంఘటన తర్వాత భారత సైన్యం సర్జికల్ స్ట్రైక్ 2.0 పేరుతో 300కు పైగా ఉగ్రవాదులను అంతం చేసి, మన వీరజవాన్‌ల రుణం తీర్చుకున్నారన్నారు. అటువంటి వీరోచిత గాథలను నేటి యువత గుర్తుపెట్టుకోవాలని తెలిపారు. మీ త్యాగం వృథా కాదు – మీ ఆశయం ఆగిపోదు.. భారత్ మాతాకీ జై, జోహార్ అమర వీరులారా ! అంటూ నినాదాలు చేస్తూ పూలతో నివాళులర్పించారు. ర్యాలీలో రాష్ట్ర విశ్వవిద్యాలయ కన్వీనర్ గంగాధర్, యూనివర్సిటీ అధ్యక్షులు చంద్రిక, యూనివర్సిటీ కార్యదర్శి వంశీ, ఉపాధ్యక్షుడు హేమంత్ రామ్, విద్యార్థులు పాల్గొన్నారు.



యూనివర్సిటీలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థి సంఘ నాయకులు

పోషకాహారంతో తల్లీబిడ్డా క్షేమం

చినలింగాయపాలెం(కాకుమాను): గర్భిణులు మంచి పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడం వల్ల తల్లీ, శిశువు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని పాండ్రపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ హేమలత తెలిపారు. పోషణ్ భి-పడాయి భి కార్యక్రమంలో భాగంగా మండలంలోని చినలింగాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హేమలత మాట్లాడుతూ గర్భిణి సమయంలో ఆరోగ్య సూత్రాలు పాటించడంతో పాటు మంచి ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఆకుకూరలు, పీచు పదార్థాలు, ప్రొటీన్‌లు కలిగిన ఆహార పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ కె.విజయ్ భాస్కర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకాయమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రయాణికుల భద్రత డ్రైవర్ల బాధ్యత

పట్నంబజారు: ప్రయాణికుల భద్రత ఆర్టీసీ డ్రైవర్ల బాధ్యతని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.నాగేంద్ర ప్రసాద్ చెప్పారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా గుంటూరు ఆర్టీసీ బస్టాండ్‌లో శుక్రవారం ఆర్ఎం రవికాంత్ ఆధ్వర్యంలో ముగింపు కార్యక్రమం నిర్వహించారు. గత 25 సంవత్సరాలకు పైగా ఎటువంటి ప్రమాదాలు చేయకుండా జాగ్రత్తగా డ్రైవింగ్ చేసిన డ్రైవర్లకు ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. ఈడీ నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనాల వల్ల అధిక ప్రమాదాలు జరుగుతున్నాయని, డ్రైవర్లు దీన్ని దృష్టిలో పెట్టుకుని జాగ్రత్తలు పాటించాలని ఆయన సూచించారు. ప్రమాద రహిత డ్రైవింగ్ చేసి మెరుగైన రవాణా సౌకర్యాలు అందించాలని చెప్పారు. గుంటూరు ఆర్టీఓ బి.సత్యనారాయణ ప్రసాద్ మాట్లాడుతూ సెల్‌ఫోన్, ఏకాగ్రత లోపించడం, ట్రాఫిక్ నియమాలు పాటించకపోవడం, మద్యం తాగడం వల్ల ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. డ్రైవర్లు జాగ్రత్తలు పాటిస్తూ ప్రమాదరహిత ప్రయాణాన్ని ప్రయాణికులకు అందించాలని సూచించారు. ఆర్ఎం ఎం.రవికాంత్ మాట్లాడుతూ ఆర్టీసీ పరిధిలో డ్రైవర్లకు అత్యుత్తమైన శిక్షణ అందిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు సత్యనారాయణ, మాలతి, పాల్గొన్నారు.



ఉత్తమ డ్రైవర్లను అభినందించి ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఆర్టీసీ అధికారులు

'స్ప్రింట్స్ మానియా'లో నగర విద్యార్థుల సత్తా

గుంటూరు ఎడ్యుకేషన్: నగరంలోని పాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ సత్తా చాటుతున్నారని కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. లక్ష్మీపురంలోని పాఠశాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. స్పోర్ట్స్ అండ్ న్యూట్రిషన్ హెల్త్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 9న విజయవాడలోని బ్లూమింగ్ డేల్ ఇంటర్నేషనల్ స్కూల్లో నిర్వహించిన స్ప్రింట్స్ మానియా–2025లో విద్యార్థులు విజయ కేతనం ఎగురవేశారని వివరించారు. ఐదో తరగతి విద్యార్థిని వై.భవాని 50 మీటర్ల హర్డిల్స్‌లో స్వర్ణ పతకం, 8వ తరగతి విద్యార్థి వై.భార్గవ్ 50 మీటర్ల హర్డిల్స్, 50 మీటర్ల పరుగు పందెం, 200 మీటర్ల పరుగు పందెంలో రజత పతకం సాధించినట్లు చెప్పారు. ఎనిమిదో తరగతి విద్యార్థులు షేక్ ఉమర్ అలీ, షేక్ అయాజ్, షేక్ మహమ్మద్, డి.దీపక్ 200 మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నారని చెప్పారు. విద్యార్థులకు మెరుగైన శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావుగారు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, ప్రైమరీ ప్రిన్సిపాల్ కర్లపూడి పార్వతీదేవి, కో–ఆర్డినేటర్స్ దుర్గా శ్యామ్, శ్రీదేవి పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న విష్ణువర్ధన్, కృష్ణవేణి, వరప్రసాదరావు

రేషనలైజేషన్ పేరుతో పని భారం తగదు

లక్ష్మీపురం: రేషనలైజేషన్ పేరుతో మున్సిపల్ కార్మికులపై పని భారం తగదని కార్మిక సంఘాల జేఏసీ నాయకులు శుక్రవారం నగరపాలక సంస్థ కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. పెరిగిన గుంటూరు నగర విస్తీర్ణం మేరకు కొత్తగా పారిశుద్ధ్య కార్మికులను నియమించాలని కోరారు. గుంటూరు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో జేఏసీ నాయకులు మాట్లాడారు. నగరపాలక సంస్థలో పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను తెలియజేసేందుకు వెళ్లిన కార్మిక సంఘాల నాయకుల నుంచి వినతిపత్రం కూడా తీసుకోకుండా కమిషనర్ పులి శ్రీనివాసులు వ్యవహరించిన తీరును తప్పుపట్టారు. 350 ఇళ్లకు ముగ్గురు కార్మికులు ఉండాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. కమిషనర్ 350 ఇళ్లకు ఒక్కరే కార్మికులు చేయాలని, ట్రాక్టర్‌కు ఇద్దరు పనిచేయాలని చెబుతున్నారన్నారు. రేషనలైజేషన్ పేరుతో కార్మికులను ఆర్థిక ఇబ్బందులకు గురి చేసే నిర్ణయానికి వ్యతిరేకంగా అవసరమైతే 17న పనులను నిలుపుదల చేస్తామని హెచ్చరిచారు. సమావేశంలో కార్మిక నాయకులు బందెల రవికుమార్, కోటిపల్లి వీరాంజనేయులు, గుంటూరు శానిటేషన్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నాయకులు వరికల్లు రవికుమార్, శానిటేషన్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నాయకులు సోమి శంకర్రావు పాల్గొన్నారు.